# ఇది ప్రేమ కాదు

రోజుకొక్కసారైనా తనను చూడందే ఉండలేని సుమన్ వారం రోజులబట్టి కనిపించకపోయేసరికి సృజన అంతరంగంలో అలజడి ఆరంభమైంది. అది పెనుతుపానుకు కడలిలో ఎగిసే కెరటాల్ని తలపిస్తోంది. పడుకున్నా ఆమెకు రెప్పపడటం లేదు. కంచం ముందు కూర్చున్నా తినబుద్ధి కావడం లేదు. సుమన్ చెప్పాపెట్టకుండా ఎక్కడికి వెళ్ళినట్లు? అతణ్ణి చివరిసారిగా కలిసింది గత గురువారం. నేటికి ఏడో రోజు. మనసు వికలమవడంతో ఆఫీసుకు సెలవు పెట్టి ఇంటినే అంటుకుపోయింది.

సృజన తండ్రిలేని పిల్ల. బిడ్డ కడుపులో ఉన్నప్పుడే రమణమ్మ భర్త యాక్సిడెంట్లో ప్రాణాలు కోల్పోయాడు. పాతికమంది స్టూడెంటు కుర్రాళ్ళకు వండిపెడుతూ ఒంటి చేత్తో సంసారాన్ని నెట్టుకొచ్చింది రమణమ్మ. ఆమె పెంపకంలో సృజన విద్యావంతురాలై ఉద్యోగం చేస్తూ మాతృమూర్తిని సుఖపెడుతోంది. అనూహ్యమైన రీతిలో ఆమెకు సుమన్‌తో పరిచయమైంది. ఇరువురి ఆలోచనలు, అభిప్రాయాలు ఒకటవడంతో దగ్గరయ్యారు. అతడు తనకులస్థుడు కాకున్నా సంస్కారవంతుడన్న భావనతో అతడి చేత తాళి కట్టించుకోవాలనుకుంది. కూతురి నిర్ణయానికి ఖంగుతింది రమణమ్మ. అయితే బిడ్డ సుఖమే తన అంతిమ లక్ష్యం కావడంతో నోరు మెదపలేకపోయింది.

సుమన్ ఒక ప్రవేట్ ఫర్ములో టెక్నీషియన్. తనకు షిఫ్ట్ డ్యూటీలు ఉన్నప్పటికీ ఏదో ఒక సమయంలో విధిగా ఆమెను కలుస్తూ ఉంటాడు. అక్కడికీ ఉండలేక రెండు మూడుసార్లు అతడి రూముకెళితే తాళం కప్ప ఆమెను వెక్కిరించింది. ఎడబాటును భరించడం తప్ప చేయగలిగిందేమీ లేకపోవడంతో నిరాసా నిస్పృహలకు లోనైంది. రకరకాల ఊహాగానాలతో ఆమె అంతరంగం అల్లకల్లోలమై పోయింది.



'పోస్ట్' అంటూ పోస్టుమాను విసిరేసిన కవరం దుకుంది సృజన.

అది సుమన్ రాసిన లేఖేనని దస్తూరీని బట్టిపోల్చింది. ఆదుర్దాగా కవరు చించి అక్షరాల వెంబడి దృష్టిసారించింది.

"సృజీ!

ఇన్నాళ్ళూ మన అభిరుచులు, అభిప్రాయాలు ఒకటే అనుకున్నాను. ప్రేమకోసం, ప్రేమించిన వ్యక్తికోసం నువ్వు ఏం చేయడానికైనా సిద్ధంగా ఉంటావని నమ్మాను. అయితే మొన్నటి రెస్టారెంట్ అనుభవం నా నమ్మకాన్ని వమ్ము చేసింది. నాకు ఎంతో ఇష్టమైన నాన్‌వెజ్ ఆర్డరు చేసినప్పుడు నీ ముఖంలో ఫీలింగ్స్ చూసాను. నా మాట కాదనలేక ప్లేటు కెలికావే తప్ప మచ్చుకైనా ఓ ముక్క నోట్ల పెట్టుకోలేకపోయావు. పైగా నువ్వు వాష్ బేసిన్‌లో వాంతి చేసుకోవడం చూసిన తర్వాత నాక నిపించింది నువ్వు నా అభిరుచుల కనుగుణంగా నడచుకోలేవేమోనని. మనిద్దరి టేస్టు ఒకటేనని నాకోసం నువ్వు ఏమైనా చేస్తావని నా ఫ్రెండ్స్‌తో ఎంతో గొప్పగా చెప్పుకున్నాను. మరి వాళ్ళ ముందే నువ్వలా నన్ను ఇన్‌సల్టు చేయడంతో నా తల తీసేసినట్లైంది. అందుకే మొన్నటి నుండి నీకు కనిపించకుండా మొహం చాటేసాను. నా భార్య ఎప్పుడూ నా మాట కాదనకూడదు. నాకిష్టమైనది నా భార్య కూడా ఇష్టపడాలి. నాకోసం, నా ఇష్టం కోసం నువ్వేం చేయడానికైనా సిద్ధంగా ఉంటావనుకున్నాను. అది నా భ్రమ అని తేలిపోవడంతో నా మనసంతా పాడైపోయింది. మనం జీవితంలో కలిసి ప్రయాణించాలంటే ఇకముందైనా జరిగిన అనుభవం పునరావృతం కాకూడదు. అందుకు నువ్వు ఇష్టపడితేనే. . .

ఇట్లు

సుమన్"

ఉత్తరం చదివి ఆలోచనలో పడింది సృజన నిమిషాలు, గంటలు ఇట్టే గడిచిపోతున్నాయి.

కాలింగ్ బెల్ ఖంగుమనడంతో చిరాగ్గాలేచి తలుపు తీసింది.

ఎదురుగా మృదుల. ఆమె సృజన ఆప్తురాలు. అంతేకాదు ఆఫీసులో కొలీగ్ కూడా.

తనకు ఎప్పుడు ఏ సమస్య ఎదురైనా మృదులతో చెప్పుకోవడం అలవాటు. అందుకే మూడ్ బాగాలేకపోయినా ఆమె రాక సృజనను బాధించలేదు. పైగా ఆహ్లాదంగా ఉంది.

"ఒంట్లో బాగోలేదా? ఆఫీసుకు రావడం మానేసావు" అడిగింది మృదుల కూర్చుంటూ.

"ఒంట్లో బాగానే ఉంది. మనసే. . ."

"మనసు బాగోలేకపోవడమేంటి? అసలు నువ్విప్పుడు సుమన్ సన్నిధిలో ఉంటావనుకున్నాను"

సమాధానంగా పెదిమ విరిచి ఆప్తురాలి చేతికి ఉత్తరం అందించింది సృజన.

"ఔనూ, ప్రేమించినవాడి కోసం అందునా కట్టుకో బోయేవాడికోసం యన్.వి. మచ్చు చూస్తే ఏం పోయింది? అది నీకు అలవాటు లేకపోవచ్చు. అంతమాత్రానికి అది తినకూడనిది కాదు కదా!"

"ఈ మాటే అతగాడినడిగితే బావుండేది. మనసిచ్చిన మగువ కోసం నీకిష్టమైన దాన్ని త్యజించలేవా అని"

"తప్పకుండా. మీ మధ్య స్పర్ధలు తొలగిపోతాయంటే నేనిప్పుడే వెళ్ళి అడుగుతాను" అంటు లేచింది మృదుల.

"వద్దు. అతడితో నువ్వేం చెప్పవద్దు. అతడు మనసు మార్చుకున్నా నేనతడిని చేపట్టే పరిస్థితి లేదు. ఎందుకో నువ్వీపాటికి గ్రహించే ఉంటావు. అతడి ప్రేమలో స్వార్థం ఉంది. ఇష్టం ఉన్నా లేకున్నా మగవాడి మాట ఆడది జవదాటకూడదన్న అహం ఉంది. అతడా మాట అనకుండా ఉంటే అన్నిటికీ నేనే ఎడ్జస్టై ఉండేదాన్ని. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. మా మధ్య ఉన్నది ప్రేమ కాదు" అంటూ స్నేహితురాలివైపు చూసింది దుఃఖ భారమంతా దిగిపోగా.

**(12-2-2004 ఆంధ్రభూమివీక్లీ)**